

మాదాపూర్‌లోని మాగంటి స్వగృహంలో గోపీనాథ్ కుటుంబసభ్యులను ఓదార్చుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



మాగంటి గోపీనాథ్ అంతిమయాత్రలో పాల్గొని పాడె మోస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు. చిత్రంలో కాలేరు వెంకటేశ్, ఎన్ భాస్కర్‌రావు తదితరులు

# గోపీనాథ్ మరణం తీరనిలోటు

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి

## మాగంటి సేవలను స్మరించుకున్న ప్రముఖులు

## ఎమ్మెల్యే మృతికి పలువురి సంతాపం

హైదరాబాద్, జూన్ 8 (నమస్తే తెలంగాణ): జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం పార్టీకి తీరని లోటు అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. మాగంటి ఎంతో కష్టపడి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారని, ఎంతో సౌమ్యుడిగా ప్రజానేతగా పేరు సంపాదించుకున్నారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ హైదరాబాద్ నగర సీనియర్ రాజకీయ నేతగా మాగంటి తనదైన స్థానాన్ని సంపాదించుకున్నారని చెప్పారు. మాగంటిని కాపాడేందుకు వైద్యులు చేసిన కృషి, పార్టీ తరఫున చేసిన ప్రయత్నాలు ఫలించక పోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తంచేశారు. మాగంటి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. మాగంటి మృతిపై సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, ఏపీ మంత్రి నారా లోకేశ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, రాజ్యసభ్య సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, సినీనటుడు మురళీ మోహన్, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ దక్షిణాఫ్రికా అధ్యక్షుడు గుర్రాల నాగరాజు తదితరులు సంతాపం తెలిపారు.

### ప్రజానాయకుడిగా గుర్తింపు : కేటీఆర్

బీఆర్ఎస్ హైదరాబాద్ శాఖ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి తన సోదరుడి లాంటివాడని, మృధుస్వభావి అని, రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదుగుతూ వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజానాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తుచేసుకున్నారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని, మంచి నాయకుడిని కోల్పోవడం అత్యంత బాధకరమని వాపోయారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమైన మాగంటి.. రాజకీయాల్లో హుందాతనానికి మారుపేరుగా నిలిచారని చెప్పారు. మాగంటి అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

### మాగంటి అకాల మరణం బాధాకరం : హరీశ్‌రావు

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణం అత్యంత బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. మాగంటి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు. రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చిన మాగంటి జీవితం ఆదర్శనీయమని, గోపీనాథ్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

### ఆత్మకు శాంతి కలగాలి

మాగంటి మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయన అకాల మరణం హైదరాబాద్ నగర ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలి. శోక తప్తులైన మాగంటి కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం ప్రసాదించాలి.

**- ఎమ్మెల్సీ కవిత**

### ప్రజానేతగా ఎదిగారు

మాగంటి కార్యకర్త స్థాయి నుంచి ఎమ్మెల్యేగా ఎదిగారు. నిత్యం నియోజకవర్గ ప్రజల మధ్య ఉంటూ ప్రజానేతగా ఎదిగారు. అలాంటి సహచర ఎమ్మెల్యేను కోల్పోవడం బాధాకరం. గోపీనాథ్ ఆత్మకు శాంతి కలగాలి. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి.

**- వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ మంత్రి**

### అత్యంత బాధాకరం

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణం తీవ్రంగా కలిచివేసింది. వారి ఆత్మకు శాంతి చేకూరాలి. వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలి.

**- శ్రీనివాస్ గౌడ్, మాజీ మంత్రి**

### ఆత్మకు శాంతి కలగాలి

ఎమ్మెల్యే మాగంటి మృతి చాలా బాధాకరం. గోపీనాథ్ ఆత్మకు శాంతి కలగాలి. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా..

**- తలసాని, మాజీ మంత్రి**

### మిత్రుడిని కోల్పోయాం

మంచి మిత్రుడిని కోల్పోయాం, ప్రజాతీర్పుతో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల్లో మాగంటి చెరగని ముద్ర వేసుకున్నారు. రాజకీయాల్లో కింది స్థాయి నుంచి ఎదిగిన గొప్ప నాయకుడు గోపీనాథ్.

**- నామా నాగేశ్వరరావు, మాజీ ఎంపీ**

### ప్రజలకు తీరని లోటు

బీఆర్ఎస్ నాయకుడు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి హైదరాబాద్ నగర ప్రజలకు, పార్టీకి తీరని లోటు. గోపీనాథ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి.

**- వినోద్‌కుమార్, మాజీ ఎంపీ**

### ప్రజల కోసం పరితపించారు

పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి.. ప్రజా ప్రయోజనాల కోసం పరితపించిన గొప్ప వ్యక్తి మాగంటి. 42 ఏండ్లుగా ఆయనతో స్నేహాన్ని కొనసాగిస్తున్నా. రాష్ట్రంలో అత్యంత ప్రతిష్ఠాత్మక నియోజకవర్గం జూబ్లీహిల్స్. ఇక్కడి నుంచి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందడమే ఆయన సేవాగుణానికి తార్కాణం.

**-మధుసూదనాచారి, మండలిలో ప్రతిపక్షనేత**

### జూబ్లీహిల్స్ అభివృద్ధికి కృషి

మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాగంటి జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేశారు. ఆయన మరణం పార్టీకి, ప్రజలకు తీరని లోటు. గోపీనాథ్ ఆత్మకు శాంతి కలగాలి.

**- డాక్టర్ బండా ప్రకాశ్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్**

### ప్రజాసేవలో అంకితభావం

మాగంటి అకింత భావంతో ప్రజాసేవ చేశారు. బీఆర్ఎస్ కోసం నిబద్ధతతో ఆయన చేసిన కృషి చిరకాలం నిలిచిపోతుంది. ఇంతటి కష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలి.

**- దాసోజు శ్రవణ్, ఎమ్మెల్సీ**

# మాగంటికి కన్నీటి వీడ్కోలు

మొదటిపేజీ తరువాయి...

మంత్రులు, ఎమ్మెల్యేలు మాగంటి నివాసానికి చేరుకుని అంజలి ఘటించారు. గోపీనాథ్ పార్థివదేహాన్ని చూసేందుకు జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు, బస్తీవాసులు, అభిమానులు, బీఆర్ఎస్ కార్యకర్తలు వేలాదిగా తరలి వచ్చి కన్నీటి నివాళులర్పించారు. 15 ఏండ్లుగా తమకు అండగా నిలిచిన నేత దూరమవ్వడంతో తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు.

### అన్నీతామై పర్యవేక్షించిన కేటీఆర్, హరీశ్

మాగంటి పార్థివదేహాన్ని దవాఖాన నుంచి ఇంటికి తీసుకొచ్చినప్పటి నుంచి అంత్యక్రియలు పూర్తయ్యేదాకా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ముందుండి పర్యవేక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం అంత్యక్రియలు పూర్తయ్యేదాకా మాగంటి నివాసం వద్దనే ఉన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్తూ వెన్నంటే ఉన్నారు. అంత్యక్రియల్లో పాల్గొని మాగంటి పాడెను కేటీఆర్, హరీశ్‌రావు మోశారు. మాదాపూర్ నుంచి జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలకు తీసుకొచ్చే క్రమంలో అన్ని కార్యక్రమాలను ముందుండి జరిపించారు. ప్రముఖులు, రాజకీయ నేతలు వచ్చివెళ్లేందుకు అనుకూలంగా ఏర్పాట్లు చేయించారు. అంతకుముందు దవాఖానలోనూ మాగంటికి మూడు రోజుల పాటు చికిత్స అందుతున్న తీరుపై వైద్యులను ఎప్పటికప్పుడు ఆరా తీశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు నివాళులర్పించేలా ఏర్పాట్లు చేయించారు.

### అశ్రునయనాలతో అంత్యక్రియలు

అశేషంగా తరలివచ్చిన రాజకీయ ప్రముఖులు, అభిమానులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య మాగంటి అంతిమయాత్ర కొనసాగింది. మధ్యాహ్నం 2.30 గంటలకు మాదాపూర్‌లోని నివాసం నుంచి అంతిమయాత్ర ప్రారంభమైంది. మాదాపూర్ నుంచి జూబ్లీహిల్స్ రోడ్ నం.45 మీదుగా ఫిలింనగర్, జూబ్లీహిల్స్ రోడ్ నం. 78 మీదుగా జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానం దాకా యాత్ర కొనసాగింది. ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో పోలీసులు గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి వందనం సమర్పించారు. సాయంత్రం 3.55 గంటలకు మాగంటి తనయుడు వాత్సల్యనాథ్ చేతులమీదుగా అంత్యక్రియలు పూర్తిచేశారు. ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్, నామా నాగేశ్వర్‌రావు, నల్లమోతు భాస్కర్‌రావు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మాగంటితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని ఆయన సేవలను కొనియాడారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గోపీనాథ్ నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజాసేవే పరమావధిగా జీవించారని నెమరేసుకున్నారు. మాగంటి అంత్యక్రియల్లో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు కవిత, దాసోజు శ్రవణ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు దీవకొండ దామోదర్‌రావు, సురేశ్‌రెడ్డి, ఈటల రాజేందర్, కే లక్ష్మణ్, వద్దిరాజు రవిచంద్ర, మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ఏపీ మంత్రి లోకేశ్ దంపతులు, కేటీఆర్ సతీమణి శైలిమ, కుమారుడు హిమాన్షు, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, పద్మారావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, మాధవరపు కృష్ణారావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ప్రకాశ్ గౌడ్, దానం నాగేందర్, మాజీ ఎంపీలు వినోద్ కుమార్, నామా నాగేశ్వర్‌రావు, మాలోతు కవిత, దగ్గుబాటి వెంకటేశ్వర్‌రావు, అంజన్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, రావెల కిషోర్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు మర్రి జనార్దన్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, గజ్జెల నగేష్, రావుల శ్రీధర్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, సినీ ప్రముఖులు మురళీమోహన్, ప్రసన్నకుమార్, జీవితరాజశేఖర్, కేఎల్ నారాయణ పాల్గొన్నారు.



మాగంటి గోపీనాథ్ కుమారుడు వాత్సల్యనాథ్‌ను ఓదార్చుతున్న హిమాన్షు



నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ ఎంపీలు దీవకొండ దామోదర్‌రావు, సురేశ్‌రెడ్డి

### కన్నీళ్లు పెట్టిన కేసీఆర్

గోపీనాథ్ పార్థివదేహాన్ని చూడగానే కేసీఆర్ కన్నీటి పర్యంతమయ్యారు. మాగంటి కుమారుడిని దగ్గరకు తీసుకుని ధైర్యం చెప్పారు. గోపీనాథ్ సతీమణి, కుమార్తె, కుటుంబ సభ్యులను ఓదార్చారు. హుందాతనానికి మారుపేరుగా నిలిచిన మాగంటి దూరమవడంపై కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన ఎంతో సౌమ్యుడిగా, ప్రజానేతగా పేరు సంపాదించారని, జూబ్లీహిల్స్ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ హైదరాబాద్ నగర సీనియర్ నేతగా తనదైన స్థానం సంపాదించుకున్నారని గుర్తుచేసుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

### 1983 నుంచి రాజకీయ ప్రస్థానం

మాగంటి గోపీనాథ్ 1963, జూన్ 2న కృష్ణమూర్తి, మహానంద కుమారి దంపతులకు హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో జన్మించారు. 1980లో ఇంటర్, 1983లో ఓయూ నుంచి డిగ్రీ పట్టా పొందారు. ఆయనకు సునీతతో వివాహం జరిగింది. వారికి కుమారుడు వాత్సల్యనాథ్, కూతుర్లు అక్షర నాగ, దిశిర ఉన్నారు. గోపీనాథ్ 1983లో రాజకీయాల్లోకి వచ్చారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొంది జూబ్లీహిల్స్ ప్రజల్లో 'గోపన్న'గా చెరగని ముద్ర వేసుకున్నారు. రాజకీయాల్లోకి ప్రవేశించినప్పటి నుంచి తిరుగులేకుండా ఎదిగారు. 1985 నుంచి 1992 వరకు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 1987, 1988లో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా) డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. 1988 నుంచి 1993 వరకు వినియోగదారుల ఫోరం అధ్యక్షుడిగా, టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత టీడీపీ నుంచి జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎంఐఎం అభ్యర్థి నవీన్ యాదవ్‌పై 9,242 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి విష్ణువర్ధన్‌రెడ్డిపై 16,004 ఓట్లతో గెలిచారు. 2018లోనే శాసన సభలో పబ్లిక్ ఎస్టిమేట్స్ కమిటీ (పీఈసీ) సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2022లో బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. 2023లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు.

### వాత్సల్యనాథ్ వెన్నంటే ఉన్న హిమాన్షు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కుమారుడు హిమాన్షు, మాగంటి గోపీనాథ్ కుమారుడు వాత్సల్యనాథ్ వెన్నంటే ఉండి ధైర్యం చెప్పారు. వీరిద్దరూ చిన్నప్పటి నుంచీ మిత్రులు కావడంతో మాగంటి దవాఖానలో చేరినప్పటి నుంచి తల్లి శైలిమతోపాటు అక్కడే ఉండి మాగంటి కుటుంబానికి హిమాన్షు అండగా ఉన్నారు. ఉదయం నుంచి దహన సంస్కారాలు పూర్తయ్యే దాకా వాత్సల్యనాథ్‌కు తోడుగా ఉన్నారు. హిమాన్షుతో పాటు తన మిత్రులు కూడా వచ్చి వాత్సల్యనాథ్‌కు సానుభూతి తెలిపారు.



వేములవాడ రాజన్న ఆలయానికి చెందిన తిప్పాపూర్‌లోని గోశాలలో చికిత్స పొందుతున్న కోడెలను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేత చల్మెడ లక్ష్మీనరసింహారావు

# కోడెల మృతికి మంత్రి సురేఖదే బాధ్యత

- దేవాదాయ శాఖ మంత్రి సురేఖ నిర్వాకం వల్లే కోడెల పంపిణీ ఆరు నెలలుగా నిలిచిపోయింది
- రాజన్న కోడెలకు సరైన మేత లేదు
- బీఆర్ఎస్ నేత చల్మెడ ఆరోపణ
- తిప్పాపూర్‌లోని రాజన్న ఆలయ గోశాల సందర్శన

వేములవాడ, జూన్ 8: వేములవాడ రాజన్న ఆలయ గోశాలలో కోడెల మృత్యు ఘోషకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖనే బాధ్యత వహించాలని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు. తిప్పాపూర్‌లోని రాజన్న ఆలయానికి చెందిన గోశాలలో ఇప్పటివరకు అధికారిక లెక్కల ప్రకారం 33 కోడెలు మృతిచెందిన విషయాన్ని గుర్తుచేశా రు. ఆదివారం ఆయన బీఆర్ఎస్ నాయకుల తో కలిసి గోశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ.. గోశాలలో సామర్థ్యానికి మించి కోడెలు ఉండటం, సరైన మేత అందించక పోవడం తదితర సమస్యలతో నిత్యం కోడెలు మృత్యువాత పడుతున్నాయ ని ఆందోళన వ్యక్తంచేశారు. నిబంధనల ప్రకారం కోడెలను రైతులకు పంపిణీ చేయకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొన్నదని విమర్శించారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సిఫారసు లేఖ ద్వారా గీసుకొండకు చెందిన రాంబాబు అక్రమ పద్ధతిలో 60 కోడెలను ఇచ్చింది నిజం కాదా? అని ప్రశ్నించారు. అందులో 49 కోడెలు మాయమయ్యాయన్నారు. మంత్రి కొండా సురేఖ నిర్వాకం వల్లే కోడెల పంపిణీ ఆరు నెలలుగా నిలిచిపోయిందని ఆరోపించారు.

# కేసీఆర్ కీర్తి అజరామరం

- దశాబ్దాల సమస్యలకు పదేండ్లలో పరిష్కారం
- కేసీఆర్‌ను భవిష్యత్ తరాలు గుర్తుపెట్టుకుంటాయి
- ప్రముఖ కవి, గాయకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్
- న్యూజిలాండ్‌లో ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు



న్యూజిలాండ్ దేశంలోని ఆక్లాండ్ నగరంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ దేశపతి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 8 (నమస్తే తెలంగాణ) : స్వరాష్ట్ర సాధకుడిగా కేసీఆర్ కీర్తి అజరామరమని ప్రముఖ కవి, గాయకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. న్యూజిలాండ్ దేశంలోని ఆక్లాండ్ నగరంలో ఆదివారం తెలంగాణ సెంట్రల్ అసోసియేషన్ నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ దేశపతి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దేశపతి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేయటంలో కేసీఆర్ నిర్వహించిన పాత్ర అద్వితీయమైనదని, ఏ ప్రలోభాలకు లొంగకుండా, అవమానాలకు అవరోధాలకు కుంగకుండా ఉద్యమాన్ని నడిపించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. దశాబ్దాల తరబడి వేధించిన ఎన్నో సమస్యలను పదేండ్ల పరిపాలనలో పరిష్కారం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా కేసీఆర్‌ను భవిష్యత్ తరాలు గుర్తుపెట్టుకుంటాయని దేశపతి స్పష్టంచేశారు. తెలంగాణ బిడ్డలు ఖండాంతరాల్లో ఉన్నప్పటికీ, వారి గుండె చప్పుడు మాత్రం ఎప్పుడూ జై తెలంగాణనే.. అని పేర్కొన్నారు.

### రక్తం పారిన నేలపై నీళ్లు పారాయి..

60 ఏండ్ల సమైక్య పాలనలో అరిగోస పడ్డ తెలంగాణలో రాష్ట్రంగా ఏర్పడ్డ తర్వాతనే ప్రశాంతత వచ్చిందని, తరతరాలుగా రక్తం పారిన తెలంగాణ నేలమీద నీళ్లు పారాయని ఎమ్మెల్సీ దేశపతి పేర్కొన్నారు. నీళ్లు లేక నెర్రెలుబాసిన భూముల్లో పచ్చని పంటలు పండాయని చెప్పారు. తెలంగాణ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్యాణ్‌రావు కాసుగంటి, నాయకుడు రామ్మోహన్ దంతాల మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధిలో తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ అవతరణ ఉత్సవాల్లో కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా డాక్టర్ మదన్‌మోహన్ శెట్టి, అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌తోపాటు, వెల్లింగ్‌టన్, టౌరంగా, క్వీన్స్ టౌన్, క్రైస్ట్ చర్చ్, రోటరోవా తదితర నగరాల్లో తెలంగాణ ప్రవాసులతో జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**THE FEDERAL BANK LIMITED**
*Regd. Office: Aluva, Kerala.*

Federal Bank Ltd., Br. Hyderabad Banjara Hills: 8-2-293/82/564/A-43, Ground Floor, Prasanthi Towers, Road No.92, Jubilee Hills, Hyderabad, Telangana- 500 096.

Branch: Hyderabad Banjara Hills | **NOTICE** | 05/06/2025

We hereby give public notice that we propose to accept the property comprised in Survey No.192 in Ramnagar Colony under Alwal Municipality having an extent of 210 Sq. yards belonging to Sri. Bhupinder Singh Gill S/o Ishar Singh Gill aged 70 years, residing H.No: 1-17- 40, Ramnagar Colony, Near Punjabi Community Hall, Alwal, Secunderabad, Hyderabad – 500010as security by way of mortgage by deposit of title deeds for the purpose of securing a loan. It is represented to us by him/her/ them that the original of his/her/ their title deed(s), viz: (sale deed, partition deed, gift deed, settlement deed, etc. as the case may be) registered as

1. Page number 4 of Document No. 3298 of 1997 Sub Registrar's Vallabhnagar office has been lost.
2. Page number 7 of Document No. 706 of 1977 Sub Registrar's Hyderabad office has been lost.
3. Page number 5 of Document No. 3734 of 1971 Sub Registrar's Hyderabad office has been lost.

Therefore, we propose to accept the certified copy of the said document in respect of the above property for deposit. If anyone has any claim whatsoever over the said property, he/shemay prefer the same before us within thirty days, from the date of this publication failing which it will be taken that there is no subsisting encumbrance on the said property."